క్లుప్తంగా

పూర్వ విద్యార్థి చేయూత



పాఠశాలకు సామగ్రిని అందజేస్తున్న దాత, ఎన్నారై వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల రవి

సూర్యాపేట : పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యా నిలయం పాఠశాలలకు పూర్వ విద్యార్థి, ఎన్నారై వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల రవి శనివారం రూ.15వేల విలువ చేసే సామగ్రిని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ సెక్రటరీ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు గుండా రమేష్, కమిటీ అభివృద్ధి సభ్యులు పీవీ లక్ష్మీనారాయణ, డాక్టర్ దండ మురళీధర్‌రెడ్డి, వాసవీ క్లబ్ జిల్లా అధికారులు కృష్ణ, జోనల్ అధికారి తల్లాడ శ్రీనివాస్, గజ్జల వెంకటరెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ ఉపాధ్యాయులంతా ఏకమవ్వాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి

సూర్యాపేట టౌన్ : బీసీ ఉపాధ్యాయులు, అధ్యాపకులంతా ఏకమై ఎమ్మెల్సీగా పూల రవీందర్‌ను గెలిపించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు టి.చిరంజీవులు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను చైతన్యం చేసి రాజ్యాధికారం సాధించేందుకు బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణ, దశరథరామారావు, గాలి మురళి తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలి

భానుపురి : శ్రీరామ్ సాగర్ నీటిని చివరి ఆయకట్టు వరకు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పెన్‌పహాడ్, మునగాల మండలాలకు చెందిన వివిధ గ్రామాల రైతులతో కలిసి అదనపు కలెక్టర్ రాంబాబు, ఇరిగేషన్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పీరయ్య, శివాజీ, లాల్, రాములు, గోపి, సుధాకర్, వెంకటరెడ్డి, రవి, సీతారాం నాయక్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన



మద్దిరాలలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల : ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా తహసీల్దార్ అమీన్‌సింగ్ శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల 144వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. పోలింగ్‌కేంద్రాలలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ వహీద్, తదితరులు ఉన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

సూర్యాపేటటౌన్ : ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ఉపాధ్యాయ, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. శనివారం సూర్యాపేటకు వచ్చిన ఆయనకు బీసీ ఉద్యమ నేత వట్టె జానయ్య యాదవ్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో తూము వెంకన్న, బయ్య మల్లికార్జున్, మన్నెం యాదగిరి, మాచనపల్లి లింగయ్య, వజ్జె వీరయ్య, బడుగుల శ్రీనివాస్‌యాదవ్, మన్నెం మురళి, లింగస్వామి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోట పరిశీలన

అర్వపల్లి : ఆయిల్‌పామ్ తోటల సాగులో ప్రాథమిక దశలోనే రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ జూనియర్ మేనేజర్ వి. శశికుమార్ కోరారు. కోడూరులో సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోటలను శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ రంగు ముత్యంరాజు, రైతులు బాకు మల్లయ్య, వెంకన్న, సోమయ్య, నాగయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కోడూరులో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న కంపెనీ అధికారులు

కొరవడిన మౌలిక వసతులు

- అర్వపల్లి పీహెచ్‌సీలో నిధుల లేమితో తీరని సమస్యలు
- పనిచేయని ఫ్యాన్లు, నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్
- రోగులు కూర్చోడానికి బల్లాలు కరువు

అర్వపల్లి : చుట్టూ నాలుగు మండలాల ప్రజలకు వైద్య సేవలందించే అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నకిరేకల్–తానంచర్ల, సూర్యాపేట–జనగామ రెండు జాతీయ రహదారులపై ఉన్న అర్వపల్లి పీహెచ్‌సీకి రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతున్నా మౌలిక వసతులు మాత్రం సమకూరడం లేదు. గతంలో ప్రతి రోజు ఈ పీహెచ్‌సీలో ఓపీ 30 మంది ఉండగా ప్రస్తుతం 100మంది వరకు రోగులు వస్తున్నారు. అయితే కనీస వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

కనీస సౌకర్యాలు లేక రోగుల పాట్లు..

అర్వపల్లిలోని పీహెచ్‌సీలోని వార్డు, గదులు, ఓపీ, ఇతర ప్రదేశాల్లో మొత్తం 12 వరకు ఫ్యాన్లు ఉండగా అందులో రెండు, మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రధానంగా ఓపీ, వార్డులో ఫ్యాన్లు పనిచేయక ఉక్కపోతతో రోగులు, సిబ్బంది ఉండలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే ఓపీ రూంలో రోగులు కూర్చోడానికి గతంలో బేంచీలు ఉండగా అవి విరిగిపోయాయి. కొద్ది నెలల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగులు పరీక్షలు చేయించుకునే వరకు కూర్చోడానికి ఫర్నిచర్ లేక నిలబడి నిరీక్షిస్తున్నారు. అలాగే తాగునీటిని అందించే వాటర్‌ప్లాంట్ రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీంతో రోగులకు నీళ్ల లేని పరిస్థితి నెలకొంది. 24గంటలు పనిచేసే ఈ పీహెచ్‌సీలో ఇన్వర్టర్ కూడా లేదు. ఇక్కడ ప్రసూతిలు కూడా ఎప్పుడూ చేస్తూనే ఉంటారు. కరెంటు పోతే పీహెచ్‌సీ అంధకారంగా మారుతోంది. ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలని రోగులు ఎప్పటి నుంచో అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ పీహెచ్‌సీకి 2ఏళ్ల నుంచి అభివృద్ధి సొసైటీ నిధులు రావడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎన్‌క్యూఏఎస్ నిధులు కూడా మంజూరు కాలేదు. దీంతో ఆస్పత్రి నిర్వహణ సక్రమంగా చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని రోగులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వార్డులో పనిచేయని ఫ్యాన్



నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం



అర్వపల్లి పీహెచ్‌సీలో మౌలిక వసతుల లేమి విషయమై డీఎంహెచ్‌ఓకు కూడా ఫిర్యాదు చేశాం. కనీసం ఫ్యాన్లు కూడా పనిచేయడం లేదు. అలాగే వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా ఉంది. రోగులు కూర్చోడానికి బేంచీలు కూడా లేవు.

– చొల్లేటి రమణ, వినియోగదారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా కొన్ని ఆస్పత్రుల్లో నిధుల కొరతతో సమస్యలు తీరడం లేదు. ముఖ్యంగా అర్వపల్లి పీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు లేవు. రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

– మచ్చ నర్సయ్య, సామాజిక కార్యకర్త

అర్వపల్లిలో కనులపండువగా పారువేట



అర్వపల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు



ఆలయం వద్ద కేరళ బ్యాండ్ కళాకారుల ప్రదర్శన

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పారువేట ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా నర్సింహస్వామి, అమ్మవార్లు భూదేవి, శ్రీదేవిలను అశ్వవాహనంపై ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ వేట ముగించుకొని తిరిగి రాత్రికి ఆలయానికి చేర్చారు. పారువేట ఉత్సవం సందర్భంగా కేరళ బ్యాండ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్కెస్ట్రా, కళాకారులచే ఒగ్గు డోలు ప్రదర్శన జరిపారు. నర్సింహస్వామి, భూదేవి, శ్రీదేవిల అవతారంలో ఏపీ రాష్ట్రానికి చెందిన కళాకారులు వేషధారణలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సామ అభిషేక్‌రెడ్డి, మందుల సూర్యకిరణ్, డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, దాయం ఝాన్సీరెడ్డి, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, బైరబోయిన మహరాజు, సైదులు, దేవాదాయశాఖ డివిజన్ పరిశీలకురాలు బి. సుమతి, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, ధర్మకర్తలు రాగి అనిల్, దిర్శనపు కృష్ణమూర్తి, ప్రవీణ్, రేఖశ్రీధర్, వెంకన్న, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవరాజసేవ

శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి దేవరాజసేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాజ వాహనంపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలు కొలువుదీరారు. దేవరాజసేవ ఉత్సవం సందర్భంగా తొలుత ఆలయంలో పూజలు జరిపి మాడ వీధులలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దేవరాజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, ధర్మకర్తలు అనిల్, కృష్ణమూర్తి, కుమార్, నాయకులు బైరబోయిన మహరాజు, సైదులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం హుండీని లెక్కించారు. హుండీ ద్వారా రూ. 2,57,735 ఆదాయం వచ్చిందని నల్లగొండ డివిజన్ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి. సుమతి, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, ధర్మకర్తలు అనిల్, కృష్ణమూర్తి, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, రేఖశ్రీధర్, కుమార్, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, సైదుల కిరణ్, కూరం రాజు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నాగారం : గురుకుల విద్యాలయంల్లో ఆదివారం జరిగే ఐదవ తరగతి ప్రవేశపరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నాగారం ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ఉంటుందని తెలిపారు. నాగారం మండలానికి చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రస్తుతం తిరుమలగిరి మండల కేంద్రంలోని వశిష్ట స్కూల్‌లో నిర్వహించబడుతుందని, ఈ పరీక్ష కేంద్రానికి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన ఆరె సైదులు అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి శనివారం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి నివాళులర్పించి, బాధిత కుటుంబీకులకు రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మాల గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంటిగొర్ల శ్రీనివాస్, భాషపోలు శ్రీనివాస్, బౌరోజు ఉపేందర్, గుట్టయ్య, లక్ష్మయ్య, ఉపేందర్, మహేష్, అవిలేను, వెంకన్న, భద్రాద్రి, సైదులు, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తునికి ఉపేంద్ర ఇటీవల బ్లాక్ ఫంగస్ వ్యాధికి గురైంది. గత నెల రోజుల నుంచి ఆమెకు చికిత్స అందిస్తున్నా వ్యాధి పూర్తిగా నయం కాలేదు. దీంతో ఆ కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన తునికి ఉపేంద్ర భర్త తునికి శ్రీనివాస్ స్నేహితులు శనివారం బాధితురాలికి రూ.10,000 ఆర్థికసాయం అందజేసి పరామర్శించారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

తిరుమలగిరి: విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలోని ఫాతిమా పాఠశాలలో శనివారం నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సీహెచ్ బాలరాజు, ప్రిన్సిపాల్ టి.రాము, కార్యదర్శి స్లీవరాణి, ఏఓ సీహెచ్ ఆంథోని, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చాగంటి అనుసూయ రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు.. బహుమతుల ప్రదానం



నూతనకల్ జట్టుకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయ పాలకవర్గం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న నల్లగొండ ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు ముగిసాయి. ఈ పోటీలలో నూతనకల్ ప్రథమ, అనాజిపురం ద్వితీయ, హుజూర్‌నగర్ తృతీయ, లోయపల్లి జట్లు చతుర్థ బహుమతులను గెలుచుకున్నాయి. కాగా విజేతలకు దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి శనివారం నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, సామ అభిషేక్‌రెడ్డి, మందుల సూర్యకిరణ్, గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ టి. గిరిధర్‌రెడ్డి, బైరబోయిన మహరాజు, సైదులు, దాసరి సోమయ్య, నిద్ర సంపత్, జీడి వీరస్వామి, నిర్వాహకులు కోటిప్రసాద్, సంపత్, నవీన్, ధర్మకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నాగారం : నాగారం మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాతి రాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తనయుడు, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి శనివారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పసుపులేటి వెంకటరెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, ఎస్‌కె.యాకుబ్‌వలీ, సురేష్, నాతి శ్రీనివాస్, రవీందర్, మధు పాల్గొన్నారు. అలాగే నాతి రాణి కుటుంబ సభ్యులను తాజా మాజీ జెడ్పీటీసీ కడియం ఇందిరాపరమేశ్వర్ దంపతులు పరామర్శించారు. అనంతరం రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పసుపులేటి వెంకట్‌రెడ్డి, వడ్డే యాదగిరి, వడ్డే మహేష్, పిన్నమరెడ్డి సోమిరెడ్డి, శీల కృష్ణమూర్తి, నాతి శ్రీనివాస్, రవీందర్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ‘జయ’ విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన జయ పాఠశాల విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : ఇటీవల నిర్వహించిన చుక్కా లక్ష్మీబాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు జయ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 1 నుంచి 20లోపు 37 మంది, 50లోపు 96 మంది, 100 లోపు 229 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. పాఠశాలకు చెందిన 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, సహకరించిన అధ్యాపకులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడి



మాధవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త నరేష్

మునగాల : డ్రమ్ సీడర్, విత్తనాలు వెదజల్లే పద్ధతుల్లో వరిసాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త నరేష్ తెలిపారు. శనివారం మునగాల మండలం మాధవరంలో భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ సీఎస్‌ఆర్ ఫండ్ సహకారంతో నేరుగా విత్తనాలు విత్తే పద్ధతిలో వరి సాగు చేపట్టడంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రమ్ సీడర్, విత్తనాలు వెదజల్లే పద్ధతులు, డ్రోన్ ద్వారా కలుపుమందు పిచికారీ విధానంపై వివరించారు. చీడపీడల సమస్య, నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ, తదితర అంశాల గురించి తెలిపారు. నేరుగా వరి విత్తే పద్ధతి ద్వారా సాగు చేస్తే కూలీల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఏ.కిరణ్, మండల వ్యవసాయాధికారి రాజు, యంగ్ ప్రొఫెషనల్ సంతోష్, రైతులు అరవింద్, సురేందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కోదాడ : అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కోదాడలోని బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కోదాడ కవలల అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చలిగంటి రామారావు, కొల్లూరు శ్రీనివాస్, నోముల శరత్, చంద్రకాంత్, హమీద్, స్వామి సురేష్, గోపారపు మహేష్, చిలువేరు వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఆదర్శ పాఠశాలల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

పెన్‌పహాడ్ : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని ఆదర్శ పాఠశాలల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం అనాజిపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల 12వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వివిధ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు దుర్గాప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థుల నాటికలు, పాటలు, డ్యాన్స్‌లు, ఉపన్యాసాలు అందరినీ ఆకర్షించాయి. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వస్రాంనాయక్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, ఇమాంపేట, గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసన్న, బి. రమేష్, వైస్ ప్రిన్సిపాల్ కె. గురుచరణ్, ఉపాధ్యాయులు గుర్రాల సోమయ్యగౌడ్, సంపత్‌కుమార్, వెంకన్న, క్రాంతికుమార్, వాసు, వీరారెడ్డి, రాజయ్యగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదర్శ పాఠశాలల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

25నుంచి 28వరకు శివరాత్రి ఉత్సవాలు

- ముస్తాబైన నాగులపహాడ్‌లోని శ్రీ త్రికుటేశ్వర దేవాలయం
- ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు

పెన్‌పహాడ్: నాగులపహాడ్ గ్రామంలోని త్రికుటేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పోగుల జానయ్య తెలిపారు. ఈ నెల 25న తెల్లవారు జామున గణపతి హోమం, రక్షాబంధన్, అంకురారోహణ, దేవతాహ్వానం, కలశస్థాపన, ఘంటరాధన, 26న గణపతి హోమం, మృత్యుంజయ హోమం, అభిషేకం, అలంకరణ దర్శనం, గ్రామ పురవీధుల్లో స్వామి అమ్మవారి పల్లికి సేవ, భజనలు, శివపార్వతుల కల్యాణం, 27న అభిషేకాలు, అర్చనలు, అన్నదాన కార్యక్రమంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, 28న అర్చనలు, అభిషేకాలు, క్రీడోత్సవాల ముగింపు, బహుమతుల ప్రదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



నాగులపహాడ్‌లోని శ్రీ త్రికుటేశ్వర దేవాలయం

ఏర్పాట్లు పూర్తి చేశాం

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. మంచినీటి, విద్యుత్ సౌకర్యాలు కల్పించాం. ఉమ్మడి జిల్లా స్థాయి గ్రామీణ కబడ్డీ, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

– పోగుల జానయ్య, దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



అర్వపల్లి : కాసర్లపహాడ్ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



నాగారం : పాటిమీదిగూడెం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యేగా బి. విగ్నేష్, కలెక్టర్‌గా ఎస్. మనోజ్, డీఈఓగా బి. మణి, ఎంఈఓగా వి. సంజన, హెచ్‌ఎంగా ఎం. రిసీంద్ర, తదితరులు ఆయా హోదాలలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సోమయ్య, దబ్బేటి యాదగిరి, భూపతి శ్రీనివాస్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్ లింగంపల్లి రేణుక తదితరులు పాల్గొన్నారు.

నాగారం : వర్ధమానుకోట గ్రామంలోని పాటిమీదిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ప్రజాప్రతినిధుల, అధికారుల, ఉపాధ్యాయుల పాత్రలను పోషించి అలరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వర్దెల్లి మల్లయ్య, అనిత, రజిత, జ్యోతి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందిస్తున్న అశోక్

ఆత్మకూర్ (ఎస్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్ అన్నారు. శనివారం కందగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్, బట్టిపెల్లి వెంకన్న, బోనగిరి సతీష్, దండిగ రమేష్, కిషన్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

నాగారం : మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పిన్నమరెడ్డి రాఘవరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి భౌతికకాయాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కదారి యాదవరెడ్డి, పసుపులేటి వెంకట్‌రెడ్డి, కాశీ వెంకటేశ్వర్లు, గుంటకండ్ల అశోక్‌రెడ్డి ఉన్నారు.